నేడు రెడ్డి సంఘం కార్తీక వనభోజనాలు

విజయవంతం చేయండి: మణికొండ రెడ్డి ఫౌండేషన్



సమావేశంలో పాల్గొన్న రెడ్డి సంఘం నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డి బంధువులంతా ఆదివారం జరిగే కార్తీకమాస వన భోజనాలలో పాల్గొని విజయవంతం చేయాలని మణికొండ రెడ్డి ఫౌండేషన్ నాయకులు కోరారు. శనివారం వారు మణికొండ రెడ్డి సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత సంవత్సరం కన్నా మిన్నగా కార్తీక వనభోజనాలను నార్సింగిలోని కేవీఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వన భోజనాలతో పాటు శివలింగానికి పూజలు, సాంస్కృతిక, మ్యూజికల్ ఈవెంట్స్‌లు, పలు రకాల స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీకాంత్‌రెడ్డి, వన భోజనాల సమన్వయకర్తలు రమణారెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీపతి రెడ్డి, రామసుబ్బారెడ్డి, శరత్‌రెడ్డి, రాంరెడ్డి, కృపాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో ముగిసిన క్రీడోత్సవాలు



విజేతలకు జ్ఞాపికలను అందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి ఇంటర్ ఇంజినీరింగ్ కళాశాలల స్పోర్ట్స్ ఫెస్ట్ ఏకలవ్య–2024 శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... క్రీడలతో మానసిక ఉల్లాసం, పోటీతత్వం, శారీరక దృఢత్వం కలుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి వారికి నచ్చిన క్రీడను జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడలలో గెలుపు, ఓటముల కన్నా అందులో పాల్గొనటమే ముఖ్యమన్నారు. గెలుపొందిన క్రీడాకారులను మెమొంటోలను అందజేసి అభినందించారు.

విజేతలు వీరే...

క్రికెట్ పోటీల పురుషుల విభాగంలో వీజేఐటీ విన్నర్స్‌గా నిలవగా ఎంజీఐటీ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. వాలీబాల్‌లో వీజేఐటీ విన్నర్స్‌గా నిలవగా ఎంజీఐటీ రన్నర్స్‌గా నిలిచింది. బాస్కెట్ బాల్‌లో ఎంజీఐటీ విన్నర్స్, సీబీఐటీ రన్నర్స్‌గా నిలిచాయి. టెబుల్ టెన్నిస్‌లో విన్నర్స్‌గా ఎంజీఐటీ, రన్నర్‌గా జీఆర్ఐటీలు నిలిచాయి. మహిళల విభాగంలో వాలీబాల్ విన్నర్స్‌గా జీఎస్ఐటీ, రన్నర్‌గా ఎస్ఎస్ఐటీ, త్రోబాల్‌లో విన్నర్స్‌గా సీబీఐటీ, రన్నర్‌గా ఎంజీఐటీ, బాస్కెట్ బాల్‌లో విన్నర్స్‌గా ఎంజీఐటీ, రన్నర్‌గా సీబీఐటీ జట్లు నిలిచాయి.

సందడిగా కార్తీక వనభోజనాలు



పద్మనాభస్వామి ఆలయ ఆవరణలో వాసవి క్లబ్ కార్తీక వనభోజనాలు



నెక్నాంపూర్ శివాలయంలో...

మణికొండ: కార్తీకమాసం సందర్భంగా పలు సంఘాలు, దేవాలయాల కమిటీలు వనభోజన కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా శనివారం నెక్నాంపూర్ శివాలయ కమిటీ ఆధ్వర్యంలో పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి దేవాలయ ఆవరణలో మణికొండ వాసవీ క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో వన భోజనాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీల నాయకులు మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రకృతితో ముడిపడి ఉంటాయన్నారు. చెట్టుచేమను పూజించే గొప్ప సంస్కృతి మనది అని పేర్కొన్నారు. అందులో భాగంగానే కార్తీకమాసంలో వాటి వద్దకు వచ్చి భోజనాలు చేసి వాటి గురించి ఆలోచన చేయాలన్నారు. వాసవీ క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు వి.వంశీకృష్ణ, కార్యదర్శి టి.యశ్వంత్, కోరాధికారి శిరీషతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్రలు

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్ర చేస్తున్నానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన నానల్‌నగర్, రింగ్‌రోడ్డు, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ జరుగుతున్న సీవరేజీ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ పనులు సకాలంలో పూర్తి చేయడం, రోడ్డుపై గుంతలను పూడ్చడం వంటి పనులను అధికారులు సరైన సమయంలో చేయడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాధనాన్ని కేటాయిస్తారని, అయితే పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. తమ తమ ప్రాంతాల్లోని సమస్యలను ఆ ప్రాంత మజ్లిస్ నాయకులు తన దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటికి అవసరమైన నిధులను కేటాయిస్తామన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు ఆలీముద్దీన్, వజీవు జీజమా తదితరులున్నారు.



సంఘీభావం తెలుపుతున్న రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



రోడ్డు దుస్థితిని పరిశీలిస్తున్న కార్తీక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

కాలుష్యంపై కదం తొక్కిన ప్రజలు

- దుమ్ము, ధూళితో ఆరోగ్య సమస్యలు
- భారీ వాహనాలతో రోడ్లు ఛిద్రం
- ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించాలని డిమాండ్
- ఆందోళనకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సంఘీభావం



కాలుష్యానికి వ్యతిరేకంగా మైహోం అవతార్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ప్రజలు

మణికొండ: 'కోట్లాది రూపాయలు వెచ్చించి ఫ్లాట్‌లు, విల్లాలు కొనుగోలు చేసి హాయిగా జీవిద్దామని వస్తే కాలుష్యంతో అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం... రణగొణ ధ్వనుల కారణంగా తలుపులు మూసుకుని జీవించాల్సి వస్తుంది... అధికారులు ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.. అందుకే రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది' అని నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల సరిహద్దులోని మై హోం అవతార్, హాల్‌మార్క్ వినిసియా గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు ఆక్రోశం వెలిబుచ్చారు.

- శనివారం వారు గచ్చిబౌలి–నార్సింగి ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాల్సిన ఆర్ఎంసీ ప్లాంట్లు నిబంధనలకు విరుద్ధంగా పక్కనే ఏర్పాటు చేయటం ఏమిటని ప్రశ్నించారు.
- ప్లాంట్ల వాహనాలు తిరిగి రోడ్లు ఛిద్రం కావటంతో స్కూల్ బస్సులు రాక వందలాది మంది విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదుల సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తమ సమస్య వినిపించినా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు.
- ఇకనైనా ప్రభుత్వం స్పందించి రెడీమిక్స్ ప్లాంట్లను దూరంగా తరలించాలని, లేదంటే రాబోయే రోజుల్లో తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.
- ఆందోళనకారుల డిమాండ్ సహేతుకమైనదని, ప్రభుత్వం స్పందించి ఆర్ఎంసీ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అభిప్రాయపడి వారికి సంఘీభావం తెలిపారు.
- రాష్ట్రానికి అత్యధిక ఆదాయం సమకూర్చిపెట్టే ఐటీ జోన్ పక్కనే రూ. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన గృహాలలో ప్రజలు నివసించలేని పరిస్థితి ఉండటం ప్రభుత్వానికి సిగ్గుచేటని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గండిపేట మండలంలోనే ఒక్క రెడీమిక్స్ ప్లాంట్ లేకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే రాబోయే రోజుల్లో పదివేల మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.
- రాష్ట్రంలోనే అత్యంత విలువైన ప్రాంతంలోనే ప్రజలు సుఖమయంగా నివసించే అవకాశం లేదంటే ఇక హైదరాబాద్‌లో ప్రజల జీవనాన్ని అర్థం చేసుకోవచ్చని బీజేపీ రాజేంద్రనగర్ ఇంచార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో వట్టినాగులపల్లిలో క్రషర్‌లతో ప్రజలు ఇబ్బంది పడి ఆందోళన చేపడితే కంటితుడుపు చర్యగా కొన్ని రోజులు మూసివేసి తిరిగి తెరిపించారన్నారు. ప్రజలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

హెచ్‌సీయూలో జరిమానాలపై విద్యార్థుల ఆందోళన

తోపులాటలో కిందపడిన చీఫ్ వార్డెన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిపాలనా భవనం ఎదుట విద్యార్థులు ఆందోళనకు దిగారు. క్యాంపస్‌లో విద్యార్థుల వసతి గృహాలను తనిఖీ చేయడానికి నియమించిన ప్రత్యేక స్క్వాడ్ తనిఖీలు చేసి ఇష్టానుసారంగా ఫైన్ విధించడం పట్ల విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం హాస్టళ్లను తనిఖీ చేసేందుకు చీఫ్ వార్డెన్ సువశిశ రాణా, ఇతర అధికారులు రావడంతో విద్యార్థులు వారిని వ్యతిరేకించారు. అనంతరం వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చీఫ్‌వార్డెన్ అక్కడి నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా తోపులాటలో చీఫ్ వార్డెన్ స్పృహతప్పి పడిపోయారు. దీంతో వెంటనే అలర్ట్ అయిన సెక్యూరిటీ సిబ్బంది ఆయన్ని క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ మాజీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు అతీక్ అహ్మద్, విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ చిన్న చిన్న అంశాలకు భారీ జరిమానాలను విద్యార్థులకు విధించడం అన్యాయమన్నారు. అనంతరం వారంతా అక్కడి నుంచి చీఫ్ వార్డెన్ కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపారు. ఈ విషయమై గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ హెచ్‌సీయూ అధికారుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని స్పష్టం చేశారు. కాగా సోమవారం సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.

ఎక్కడి చెత్త అక్కడే ఉపయోగించాలి

సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ సంధ్య



చెత్తతో వర్మికంపోస్టు ఎరువుల తయారీని తెలుసుకుంటున్న జేడీ సంధ్య

మణికొండ: మున్సిపాలిటీల్లోని చెత్త ఎక్కడికక్కడే తిరిగి ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పురపాలక శాఖ జాయింట్ డైరెక్టర్ సంధ్య అన్నారు. శనివారం నార్సింగి మున్సిపాలిటీ చెత్త రీసైక్లింగ్ యూనిట్‌ను రాష్ట్రంలోని 12 మున్సిపాలిటీల కమిషనర్‌లు, ఏఈలు, శానిటేషన్ ఇంచార్జిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తున్న విధానం దాన్ని తడి చెత్తతో వర్మికంపోస్టు ఎరువుల తయారీ, పొడి చెత్తను ముద్దలుగా చేసి అమ్మకాలు చేసి ఆదాయం సమకూర్చుకోవటం తదితర విధానాలను మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ... ఇదే తరహాలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో చేపడితే పర్యావరణ సమస్యలు, చెత్త డంపింగ్ సమస్యలు, ప్రజలకు ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయన్నారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇంచార్జి లచ్చిరాంలతో పాటు 12 మున్సిపాలిటీల కమిషనర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత ఏఈ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐజీహెచ్ఎస్ ఇండస్ట్రియల్ మధుబన్ కాలనీ వాటర్ ట్యాంక్, శివాజీనగర్, జల్పల్లి ఇండస్ట్రియల్, పద్మశాలీపురం, ఆప్కో కాలనీ, అక్షయ్ ఫుడ్, త్రిశూల్ ఫుడ్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని వివరించారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ రాజు

మణికొండ: కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ఫెడరేషన్ కప్ పోటీలలో కోకాపేటకు చెందిన నలుగురు విద్యార్థులు రాణించి బంగారు పతకాలను సాధించారని కోచ్ రాజు తెలిపారు. పలు విభాగాలలో పోటీ పడిన కె.తనుష్, కె.లౌషిక్, వి.విష్ణు, ఎ.చరణ్‌యాదవ్‌లు బంగారు పతకాలను సాధించారన్నారు. రాబోయే రోజుల్లోను మరిన్ని టోర్నమెంట్‌లలో మరింత మంది రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతామని కోచ్ పేర్కొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



కిస్మత్‌పూర్‌లో అయ్యప్ప స్వామి పడి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అయ్యప్ప స్వామి నామస్మరణతో మారుమోగింది. కిస్మత్‌పూర్ శ్రీకృష్ణ కాలనీలో నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి మహాపడి పూజను వైభవంగా నిర్వహించారు. కేశవ గురుస్వామి చేతులమీదుగా ఈ పూజలు జరిగాయి. భక్తిగీతాల ఆలాపనతో భక్తిపారవశ్యం నెలకొంది. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ పూజల్లో పరిసర ప్రాంతాల ప్రజలు, అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి



సత్యసాయి భజనలో పాల్గొన్న భక్తులు

మణికొండ: భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా జయంతి ఉత్సవాలు మణికొండలో శనివారం ఘనంగా ముగిశాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పంచవటి కాలనీలోని పురవీధులలో మహానగర సంకీర్తన, పల్లకి ఉత్సవం, కోలాటాలు, బాణసంచా కాల్చటం, వస్త్ర వితరణ, మహా నారాయణ సేవ (అన్నదానం) నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి భజన, బాల వికాస్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఊయల ఉత్సవం, మహా మంగళహారతి, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన పురాతన ఇతిహాస అంశాలలతో కూడిన ప్రదర్శలు అందరినీ అలరించాయి. మణికొండ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బసవరాజు, సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సర్వేయర్ కావలెను!

- ఇంచార్జిలతో ఇబ్బందులు
- పెండింగ్‌లో వందల దరఖాస్తులు
- కోర్టు ఆదేశించినా కాని సర్వేలు
- కోర్టు ధిక్కరణ కేసులు వేస్తున్న ప్రజలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



గండిపేట తహసీల్దార్ కార్యాలయం

మణికొండ: రాష్ట్రంలోనే భూములు, భూ సంబంధిత వివాదాలు, విలువల పరంగా ఎంతో కీలకమైన మండలంగా గండిపేట మండలాన్ని చెప్పొచ్చు. ఎక్కువ శాతం భూములు ప్రముఖుల చేతుల్లోనే ఉన్నాయి. భూముల విలువ అమాంతం పెరిగిపోవటంతో అనేక వివాదాలు తెరపైకి వస్తున్నాయి. దాంతో వాటి పరిష్కారానికి చాలా మంది సర్వేకు దరఖాస్తులు చేస్తున్నారు. ఆ దరఖాస్తులు కాస్తా గుట్టలుగా పేరుకుపోతున్నాయి. నెలలు గడిచినా సర్వే జరగక పోవటం.. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దరఖాస్తుదారులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాలు, అధికారులు ఇలాంటి భూ వివాదాలను వెంటనే పరిష్కరించి వారికి ఉపశమనం కల్పించాల్సిన బాధ్యతను విస్మరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక చేసేది లేక దాదాపు పది మంది ఏకంగా కోర్టును ఆశ్రయించి తమ భూములను సర్వే చేసి ఇవ్వాలని ఆదేశించాలని వేడుకున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అప్పటికీ పని కాకపోవటంతో ఇద్దరు భూ యజమానులు ఏకంగా కోర్టు ధిక్కరణ కేసులు వేశారు. ఇలాంటి పరిస్థితిని కొందరు ప్రభుత్వ పెద్దల వద్ద మొరపెట్టుకోవటంతో ఏకంగా కలెక్టర్‌ల బదిలీలు సైతం జరిగాయని పలువురు పేర్కొంటున్నారు. అయినా పరిస్థితిలో మార్పు రావటం లేదని వారు వాపోతున్నారు.

కృత్రిమ కొరత సృష్టించి...

రంగారెడ్డి జిల్లాలో ఎక్కువ శాతం మండలాలలో భూముల విలువ పెరగటంతో వివాదాలు పెరిగిపోతున్నాయి. అదే స్థాయిలో సర్వేయర్లను నియమించాల్సిన అవసరం ఎంతో ఉంది. అందుకు భిన్నంగా పరిస్థితి ఉంది. జిల్లాలో 27 మండలాలు ఉండగా కేవలం 14 మంది సర్వేయర్లను మాత్రమే నియమించారు. వారినీ కీలక మండలాలకు కాకుండా అంతగా పనిలేని మండలాలకే నియమించటం సర్వే విభాగం ఉన్నతాధికారుల పనితీరుకు నిదర్శనం. జిల్లాలో కావాలనే సర్వేయర్ల కృత్రిమ కొరత సృష్టించి తమ పని జరగాలంటే వారు అడిగినంత ఇవ్వాల్సిందే అనే పరిస్థితిని కలిపిస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఉదంతాలతోనే గండిపేట మండలంలో గత సర్వేయర్ గణేష్‌ను ఓ వ్యక్తి ఏసీబీకి పట్టించారు. అయినా కొందరు ఏమాత్రం జంకకుండా అదే తరహాలో పనిచేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత ఉన్న గండిపేట మండలానికి మహేశ్వరం మండలానికి చెందిన సర్వేయర్‌ను ఇంచార్జిగా నియమించటం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటేషన్లు అధికం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అంతర్గత పని కొనసాగిస్తున్న మూసీ సుందరీకరణ, ట్రిపుల్ ఆర్ రోడ్డు, రేడియల్ రోడ్ల నిర్మాణం, ఫోర్త్ సిటీ నిర్మాణం లాంటి అనేక పనులు జిల్లాలో జరుగుతున్నాయి. దాంతో జిల్లాలోని సర్వేయర్లను ఆయా పనుల నిమిత్తం వినియోగిస్తుంది. ఉన్న 14 మంది సర్వేయర్లను ఆయా పనులకు డిప్యూటేషన్‌లపై నియమిస్తున్నారు. దాంతో వారు చిక్కరు.. దొరకరు అనే చందంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఉన్న సర్వేయర్లు ప్రభుత్వ ఆదేశాలతో చేపడుతున్న పనులు పూర్తి చేసేది ఎప్పుడు.. తమ పనులు చేసేది ఎప్పుడంటూ పలువురు వాపోతున్నారు.

పక్క జిల్లాల్లో వేరు...

హైదరాబాద్ జిల్లాలో ఉన్న 16 మండలాలలో రెవెన్యూ పరంగా అంతగా పనిలేక పోయినా ఏకంగా 19 మందిని నియమించారు. అదే తరహాలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15 మండలాలకు గాను ఏకంగా 30 మంది సర్వేయర్లను నియమించటంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆయా రెండు జిల్లాల కన్నా అధిక భూముల వివాదాలతో పాటు ప్రభుత్వ ఆదేశాలతో కొనసాగుతున్న పనులు రంగారెడ్డి జిల్లాలోనే అధికంగా ఉన్నా సర్వేయర్లను మాత్రం తగిన స్థాయిలో నియమించకపోవటం ఏమిటని వారు నిలదీస్తున్నారు. సర్వే విభాగం ఉన్నతాధికారులు వారి అనుచరులను కొందరిని జిల్లాలో నియమించి వారి ద్వారా భూ లావాదేవీలకు పెద్దపీట వేయటంతోనే వారిని తక్కువగా నియమించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారులు జిల్లాలో అవసరమైన మేరకు సర్వేయర్లను నియమించి భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని అనేక మంది కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్ ఫోకస్

- పాఠశాలల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి
- పరిశుభ్రతతోనే పరిపూర్ణ ఆరోగ్యం
- బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర



మణికొండలోని ప్రభుత్వ పాఠశాలలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్

బండ్లగూడ: పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. ఇందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ గంధంగూడలోని ఇందిరారెడ్డినగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో, 16వ డివిజన్‌లోని లక్ష్మీనగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాల పరిశుభ్రత, నిల్వ ఉన్న మురుగు నీరు, మంచి నీటి సరఫరా ఏర్పాట్లు, రిపేర్లు, పిచ్చి మొక్కల తొలగింపు తదితర పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇందులో భాగంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అలాగే పేరుకుపోయిన చెత్తాచెదారం, మట్టి కుప్పలను తొలగిస్తున్నామన్నారు. ఎవరైనా ఖాళీ ప్రదేశాల్లో చెత్తాచెదారం, మట్టిని డంప్ చేస్తే వారిపై చర్యలు తీసుకోనున్నట్లు ఆయన హెచ్చరించారు.



ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

మణికొండలో...

మణికొండ: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టినట్టు మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అపరిశుభ్రతకు అవకాశం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడప్పుడు ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించి సానిటేషన్, మురుగునీటిని తొలగిస్తున్నామన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.